క్లుప్తంగా

గోకులాల నిర్మాణం వేగవంతం చేయాలి



ఒమ్మిలో గోకులం నిర్మాణం పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: గోకులాల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శ్యాంపురం, ఒమ్మి పంచాయతీల్లో చేపడుతున్న గోకులాల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసి, సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. మండలంలో మొత్తం 13 గోకులాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

తెర్లాం: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ సాగర్‌బాబు తన సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి లైసెన్స్‌లు, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. వాటిలో ఏ ఒక్కటీ లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



సూచనలిస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్యామలాకుమారి సూచించారు. మండలంలోని బూరాడ పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. ప్రజలకు ఎప్పటికప్పుడు ఆరోగ్యం, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని, జ్వరపీడితులను గుర్తించి, సకాలంలో వారికి వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలని సర్పంచ్‌లను కోరారు.

రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు



మాట్లాడుతున్న ఏపీడీ కిరణ్‌కుమార్

బొబ్బిలిరూరల్: ఉపాధి హామీ పథకం వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని ఏపీడీ ఎం.కిరణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డివిజనల్‌లోని ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆయన.. రైతులకు మేలు చేకూరేలా వ్యవసాయ సంబంధిత పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పప్పు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రాజాం: క్షయవ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధేశ్వరి, క్షయవ్యాధి నిర్మూలన విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ లలితలు సూచించారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. అనంతరం వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ సరోజిని, సీహెచ్‌వో ఉషారాణి, హెచ్ఎస్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

బొబ్బిలిరూరల్: మండలంలోని కేశాయివలస గ్రామంలో గాంధీ స్మారకనిధి అధ్యక్షుడు మింది విజయమోహన్ ఆధ్వర్యంలో వనమిత్ర కృష్ణదాసు, తిరుపతి తదితరులు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో నిరుపేదలకు సహకరించేందుకు మరింతమంది దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

ఆదాయం బాగున్నా.. ఆదరణ కరువు!



మారేడుబాక సమీపంలో సాగు చేస్తున్న మలబార్ వేప పంట

- మలబార్ వేప సాగుతో ఆదాయం బాగు
- అవగాహన లేక సాగుకు రైతుల అనాసక్తి
- కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం
- సహకరించని అటవీ శాఖ
- క్రమంగా తగ్గుతున్న సాగు విస్తీర్ణం

రాజాం: మలబార్ వేప సాగు ద్వారా ఆదాయం బాగున్నా.. సాగుకు మాత్రం రైతులు ఆసక్తి కనబరచడం లేదు. ప్రభుత్వం ప్రోత్సహించకపోవడంతో పాటు అధికారులు అవగాహన కల్పించకపోవడం, అటవీ శాఖ సైతం అంతగా సహకరించకపోవడం వంటివి దీనికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ప్రస్తుత కాలంలో రైతులు కూడా వినూత్నంగా ఆలోచిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే సాగు పద్ధతులను అవలంబించేందుకు ముందుకువస్తున్నారు.

అయితే వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం, అధికారుల నుంచి అవగాహన, సలహాలు, సూచనలు వంటివి లభిస్తే వారు దర్జాగా సాగుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే రాజాం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మలబార్ వేప సాగు కనిపిస్తోంది. అయితే ఈ పంట సాగు, విక్రయాలపై అవగాహన కల్పించకపోవడం, పంట కటింగ్ సమయంలో అటవీ అధికారుల నుంచి ఇబ్బందులు తలెత్తడం వంటి వాటితో రైతులు మలబార్ వేప సాగుకు అంతగా ముందుకురావడం లేదు. దీంతో క్రమక్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది.

ఆరేళ్లకు ఆదాయం..

మల్‌బార్ వేప పంట సాగు ప్రారంభించిన వెంటనే ఫలితాలు ఇవ్వదు. ఆరేళ్ల తర్వాత ఈ పంట ద్వారా ఆదాయం లభిస్తుంది. అయితే 15 ఏళ్ల పాటు ఈ పంట ద్వారా ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయి. ఎకరం పొలంలో 300 మొక్కలు వేయాల్సి ఉంటుంది. ఆరుతడి నేలలు ఈ పంటకు అనుకూలంగా ఉంటాయి. ఆరేళ్ల తర్వాత నుంచి కోత దశకు వచ్చిన ప్రతీసారి ఐదు పర్యాయాలు ఈ మొక్కలను కోసి విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. ప్రతీ మూడేళ్లకోసారి కోత చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మలబార్ వేప కలపకు మంచి డిమాండ్ ఉంది. ఫర్నిచర్, పేపర్, చిన్నచిన్న ఆటవస్తువులు, ప్లేవుడ్ తయారీకి దీనిని బాగా వినియోగిస్తారు. నాణ్యతతో ఉన్న కలపకు మరింత డిమాండ్ ఉంటుంది. పంట కటింగ్ సమయంలో అటవీ శాఖ అనుమతులు కచ్చితంగా ఉండాలి. అయితే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో అనుమతులు రాకపోవడం, విక్రయాల వద్ద దళారీ వ్యవస్థ దౌర్జన్యం వంటివి సాగుపై అనాసక్తిని పెంచుతున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు.

100 టన్నుల వరకు దిగుబడి..

మలబార్ వేప సాగుపై రైతులకు అవగాహన కల్పించడంలో అటవీ శాఖ పూర్తిగా విఫలమైంది. ఎకరం పొలంలో 100 టన్నుల వరకు దిగుబడి వచ్చే ఈ పంట సాగును ప్రభుత్వం, అధికారులు ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పొనుగుటివలస, పొగిరి, మారేడుబాక, శ్యాంపురం, బొద్దూరు, వంగర తదితర గ్రామాల్లోని రైతులు ఈ పంట సాగుకు అడుగులు వేస్తున్నారు.

ఇబ్బందులు ఉన్నాయి..

పంట కటింగ్, విక్రయాలు సమయంలో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. ఐదు నుంచి ఆరేళ్లకు మొదటి కటింగ్ వస్తుంది. ప్రతీ మూడేళ్లకు ఒక కటింగ్ చొప్పున ఐదు కటింగ్‌లు చేసుకోవచ్చు. పంట పండితే ఆదాయం బాగానే ఉంటుంది. ప్రభుత్వం, అధికారుల నుంచి కూడా ప్రోత్సాహం అవసరం.

– వై.వెంకటేష్, రైతు, మారేడుబాక, రాజాం మండలం

పింఛన్ కోసం ఎదురుచూపు



ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు.. మాదిశ నారాయణమ్మ. బాడంగి మండలం, గొల్లాది గ్రామానికి చెందిన ఈమె వయసు 73 ఏళ్లు.. రెండేళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తోంది. అయినా ఇంతవరకు పింఛన్ మంజూరు చేయలేదు. రెండేళ్ల క్రితం భర్తను, ఆరేళ్ల క్రితం కొడుకును కోల్పోయి దిక్కూమొక్కూ లేని జీవనం సాగిస్తోంది. భర్త ఉన్నంత వరకు పింఛన్ వచ్చేదని, ఇప్పుడు తనకు పింఛన్ రాకపోవడంతో పూట గడవడమే కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం స్పందించి, పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తోంది. – బాడంగి

'దారి'ద్ర్యం..





వంగర మండలంలోని చాలా గ్రామాల పంటపొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో రైతులు, కూలీలు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. వర్షాకాలంలో అయితే బురదమయమైన రోడ్డులో ఎక్కడ జారిపడిపోతామో తెలియదని, పొలాల నుంచి కళ్లాలలకు పంటను తరలించడం కూడా కష్టమవుతోందని వాపోతున్నారు. కోణంగిపాడు, కొత్తమరువాడ గ్రామాల్లోని పంటపొలాలకు వెళ్లే దారులు ఇలా దారుణంగా ఉన్నాయి. కనీసం రోడ్డును చదును చేసి, కంకర అయినా వేయాలని రైతులు కోరుతున్నారు. – వంగర

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం..



కుష్టువ్యాధిని నిర్మూలిద్దామని పిలుపునిస్తూ రేగిడి మండలంలోని బూరాడ చిన్నశిర్లాం గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.చలమయ్య, రీనాచౌదరిలు తొలుత వ్యాధి లక్షణాలు, అది ఏ విధంగా సోకుతుంది.. వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, నొప్పిలేని బుడిపెలు, కాళ్లుచేతులకు తిమ్మిర్లు వంటి లక్షణాలు ఉంటే ఆస్పత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, సీహెచ్ఎస్ సావిత్రి, ఎమ్ఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు. – రేగిడి

శతశాతం పన్నులు వసూళ్లు చేయాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ శతశాతం మేర ఇంటి పన్నులు వసూళ్లు చేయాలని ఎంపీడీవో రేగి రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. పంచాయతీల వారీగా ఇచ్చిన ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు. ఇంతవరకు వసూళ్లు చేసిన డబ్బులు ఎందుకు ఖాతాల్లో జమ చేయలేదని ప్రశ్నించారు. ఎప్పుడు వసూలు చేసిన డబ్బులు అప్పుడే పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు



నాయరాళ్లవలసలో కత్తెరపురుగు సోకిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని నాయరాళ్లవలస, బూరాడ, తాటిపాడు, లచ్చన్నవలస తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకినట్లు ఏవో జి.మురళీకృష్ణ, ఏఈవో లీలామోహన్‌లు శుక్రవారం పరిశీలించి, నిర్ధారించారు. అనంతరం పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బెంజోయేట్ 100 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. అలాగే లీటరు వేపనూనె కూడా వేసి ఆకు పూర్తిగా తడిచేలా పిచికారీ చేస్తే కత్తెరపురుగును నివారించవచ్చని తెలిపారు.

లోక్‌అదాలత్ సేవలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న న్యాయమూర్తులు

బొబ్బిలి: జాతీయ లోక్‌అదాలత్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు సూచించారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సివిల్, ఎక్సైజ్ పోలీసులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్న కేసుల వివరాలు, కేసుల రాజీ ద్వారా కక్షిదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇరువర్గాల కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకునేలా చైతన్యం చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, రూరల్ సీఐ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సమయానికి విధులకు హాజరుకావాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: అన్ని సచివాలయాల సిబ్బంది సమయానికి విధులకు హాజరుకావాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఎంజేవలస, రాజయ్యపేట గ్రామ సచివాలయాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ప్రతినెలా సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న ధ్రువీకరణ పత్రాల వివరాలు, సేవలను రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. గ్రామాల్లో సీనియర్ సిటిజన్ సర్వే, హౌస్ హోల్డ్ సర్వేలపై దృష్టిసారించాలన్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..



పెదమానాపురం వద్ద ఒడిశా ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

దత్తిరాజేరు: సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నారు. సమాయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గంటల తరబడి రోడ్ల మీద వేచి ఉన్నా సమయానికి బస్సులు రావడం లేదు. ఉన్న బస్సులకు కూడా ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేయడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. మండలంలోని షికారుగంజి, పాచలవలస, దత్తి, కృష్ణాపురం, ఇంగిలాపల్లి, పోరలి, సరయ్యవలస, దత్తిరాజేరు, రామచంద్రాపురం, చింతలవలస, తదితర గ్రామాలకు చెందిన వారు వైజాగ్, విజయనగరం, కాకినాడ, భీమవరం, విజయవాడ, తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే పెదమానాపురం, మరడాం, షికారుగంజి కూడళ్ల వద్ద బస్సులు ఎక్కాల్సి ఉంటుంది. అయితే సకాలంలో బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

తూర్పుకాపుల అభివృద్ధికి కృషి చేస్తా

రాజాం: తూర్పుకాపుల అభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ తూర్పుకాపు సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మక్క సాయిబాబనాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును ఆయన శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని తూర్పుకాపులందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం సహకరించేలా తమవంతు సాయం చేయాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు.

ఆర్థికంగా ఎదగాలి

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం పి.గోవిందరావు ఆకాంక్షించారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గ్రామైక్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. మహిళా సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. పొదుపు నిల్వలతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపులపై ఆరాతీశారు. రుణాలు సక్రమంగా వినియోగించుకుని ఉపాధి పొందాలన్నారు.

23న నవదుర్గ హుండీల కానుకల లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గమ్మ ఆలయ హుండీల కానుకలను ఈ నెల 23వ తేదీన లెక్కిస్తున్నామని ఆలయ ఈవో పి.శ్యామలరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీలు తెరిచి, అందులోని ఆదాయం లెక్కించనున్నామన్నారు.

గ్రామ సంఘాల సమావేశాలు తప్పనిసరి

రాజాం: గ్రామాల్లో ప్రతినెలా గ్రామ సంఘాల సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని వెలుగు రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాల్లోని సీసీలు, ఏపీఎంలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. మహిళా సంఘాల బలోపేతానికి ఏర్పాటు చేసిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రారంభ దశ నుంచి ఇప్పటివరకు అందించిన రుణాలు, రికవరీలు, బకాయిలపై దృష్టి సారించాలని తెలిపారు. సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకర్, ఫైనాన్స్ ఏపీఎం కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

రామభద్రపురం: వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై రుణాలు పొందేందుకు అర్హులైన వారంతా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రత్నం కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ మండలంలోని బీసీ, ఈబీసీ, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య కులాలకు చెందిన అర్హులైన వారంతా ఏపీవోబీఎంఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బ్యాంకు రుణం 50 శాతం, సబ్సిడీ శాతంతో యూనిట్లు పొందేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా 71, ఈబీసీ కార్పొరేషన్, బ్రాహ్మణ కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్, వైశ్య కార్పొరేషన్‌ల ద్వారా ఒక్కొక్కటి చొప్పున మాత్రమే రుణం ఇచ్చేందుకు టార్గెట్ ఉందన్నారు.

రుణాలు తీసుకున్నవారు తప్పనిసరిగా యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ సూచించారు.

మండలంలోని బూరాడ, రేగిడి, సంకిలి ఐసీడీఎస్ సెక్టార్లలో శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని తెలిపారు.

నేడు స్వచ్ఛ భారత్-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

బాడంగి/బొబ్బిలి: మండల కేంద్రాల్లో స్వచ్ఛ భారత్–స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ శనివారం నిర్వహిస్తున్నట్లు బాడంగి ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎవరి కార్యాలయాన్ని వారు పరిశుభ్రం చేసుకోవాలని, కార్యాలయ ఆవరణలు కూడా స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలని వారు కోరారు. ఉదయం 10 గంటలకు బాడంగిలో.. ఉదయం 9 గంటలకు బొబ్బిలిలో ర్యాలీ, మానవహారం వంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు.

4 కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్ష

శృంగవరపుకోట: ఎస్.కోటలోని నాలుగు కేంద్రాల్లో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించనున్నట్టు ఎంఈఓ నర్సింగరావు తెలిపారు. పట్టణంలోని నారాయణ కేంబ్రిడ్జ్, రవీంద్ర భారతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లో 864 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. దీనికోసం 36 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లు పట్టుకుని ఉదయం 10.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 11.15 గంటలకు ప్రశ్నపత్రం ఇస్తారని, మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష రాసేందుకు అనుమతిస్తారని చెప్పారు.